క్లుప్తంగా

తడిసిన విద్యుత్ స్తంభాలను పట్టుకోవద్దు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మిచాంగ్ తుపాను నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని తడిసిన విద్యుత్ స్తంభాలను పట్టుకోకూడదని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తడిసిన విద్యుత్ మీటర్లు, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను చేతులతో అంటుకోకూడదని తెలిపారు. పొడిగా ఉన్న చిన్న కర్ర, ప్లాస్టిక్ వస్తువులతో స్విచ్ వేసుకోవాలన్నారు. విద్యుత్‌కు సంబంధించిన ఏ వస్తువులను చేతులతో అంటుకోవద్దని అన్నారు. చిన్న పిల్లలను కరెంట్ వస్తువులకు దూరంగా ఉంచాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో సోమవారం కార్తిక మాసోత్సవాలలో భాగంగా ఆలయకమిటీ ఆధ్వర్యాన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ వ్రతాలలో 50 మంది దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

టెక్యం పాప మృతికి ఎమ్మెల్యే విష్ణు సంతాపం


పాయకాపురం(విజయవాడరూరల్):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు టెక్యం కృష్ణ తల్లి టెక్యం పాప(87) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు రాజీవ్‌నగర్ లోని టెక్యం కృష్ణ ఇంటికి వెళ్లి అతని తల్లి పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

ఘనంగా నేవీ డే వేడుకలు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాలలో నేవీ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భారత నావికా దళంలో జరిగే కమ్యూనికేషన్స్ వ్యవస్థతో పాటు నౌక దళాలు శత్రువులను ఎదుర్కొనే విధానాలను తెలియజేస్తూ ఎన్‌సీసీ నావెల్ క్యాడెట్లు నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. 8వ ఆంధ్రా నావెల్ యూనిట్ కమాండింగ్ అధికారి కెప్టెన్ ఆర్.శ్రీనివాసరావు హాజరై క్యాడెట్లు రూపొందించిన నమూనాలను పరిశీలించి, క్యాడెట్లను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల, కళాశాల అధ్యాపకులు నమూనాలను పరిశీలించారు. కార్యక్రమాన్ని కళాశాల నావెల్ ఎన్‌సీసీ ఆఫీసర్ వెంకటేష్ పర్యవేక్షించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు



పటమట(విజయవాడ తూర్పు): ఆస్పత్రి బయట ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులో మంటలు చెలరేగిన సంఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పటమట పోలీసులు తెలిపిన వివరాల మేరకు భారతీనగర్ నోవాటెల్ సమీపంలోని అక్కినేని ఉమెన్స్ ఆస్పత్రి బయట ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులో సోమవారం షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. వెంటనే ఆస్పత్రి సిబ్బంది ఆటోనగర్ ఫైర్ స్టేషన్ సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆస్పత్రికి స్వల్ప ఆస్తి నష్టం సంభవించిందని, ఎలాంటి ప్రాణాపాయం కలగలేదని, రోగులందరూ సురక్షితంగా ఉన్నారని పటమట పోలీసులు తెలిపారు.

'మిచాంగ్'తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- చిన్నారులను ఇంటి వద్దనే ఉంచండి
- తుఫాన్ దృష్ట్యా అధికారుల ముందస్తు జాగ్రత్త చర్యలు
- వీఎంసీలో స్పెషల్ సెల్ ఏర్పాటు



చిల్లకల్లు నదీ తీరంలో అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ అజిత

పటమట(విజయవాడతూర్పు): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. సోమవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మిచాంగ్ తుఫాన్‌కు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రజలందరికీ మిచాంగ్ తుఫాన్ గురించి అప్రమత్తం చేయాలని, చిన్నారులను ఇంటి వద్దనే ఉంచాలన్నారు. తుఫాన్ సూచనలు ఉన్నందున తీవ్ర గాలులు వర్షాలు పడే అవకాశాలు ఉంటాయాని చెప్పారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్ల వద్ద చిన్నారులను పంపించకూడదని సూచించారు. తుఫాన్ కారణంగా నగర వాసులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి, వడపోసి తాగాలని సూచించారు.

పునరావాసం ఏర్పాటు

డీ – వాటరింగ్ కోసం పంప్స్, ఔట్ ఫాల్ డ్రెయిన్స్ క్లీనింగ్‌కు జేసీబీలు అన్ని చోట్ల ముందుగానే సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. విద్యుత్ సమస్య వచ్చినా ప్రజలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్య తలెత్తకుండా అన్ని చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంక్లు ముందుగానే నింపాలని సూచించారు. తుఫాన్ ప్రభావంతో నగరంలో తీవ్ర గాలుల వీస్తున్నందున బ్యానర్లు, హోర్డింగ్లు పడిపోయే అవకాశాలు ఉంటాయని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో కొత్త బ్యానర్లు, హోర్డింగ్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలులేదని, ప్రస్తుతం ఉన్న బ్యానర్లు, హోర్డింగ్లు ప్రమాదవశాత్తు ఏవి ఉన్నాయో గుర్తించి పలు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కొండ ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, కొండ రాళ్లు పడే అవకాశమున్న ప్రాంతాలు ముందుగానే ఖాళీ చేయాలని చెప్పారు. తుఫాన్ తీవ్రత తగ్గిన తర్వాత ప్రజలు మళ్లీ తమ ఇళ్లకు రావొచ్చని అప్పటి వరకు ఆ ఏరియాల్లో ఉన్న స్కూళ్లలో వాళ్లకు పునరావాసం కల్పిస్తున్నామన్నారు. ఏ ప్రాంతంలో ఏ స్కూల్‌కు వెళ్లాలి అన్న విషయం, వలంటీర్ లేదా వీఆర్వో ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. నగర పరిధిలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లు మొత్తం మూసే అవకాశం లేనందున అందులో ఎక్కువగా చెత్త పేరుకుపోయినందున జేసీబీలతో వాటిని తొలగిస్తున్నామన్నారు. ఈ క్రమంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్లు మొత్తం మూసేయ్యటానికి అవకాశం లేదని చెప్పారు. అవుట్ ఫాల్ డ్రెయిన్ల వద్ద నివసించే వారంతా వారి ఇళ్లలోని చిన్నారులను బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



కొండ ప్రాంత వాసులకు నోటీసులు ఇస్తున్న సచివాలయ సిబ్బంది

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విజయవాడస్పోర్ట్స్: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను డీసీపీ వి.అజిత అప్రమత్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని కృష్ణా నదీ తీరాన ఉన్న నందిగామ, జగ్గయ్యపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు. మిచాంగ్ తుఫాన్ నెల్లూరు–మచిలీపట్నం ప్రాంతాల్లో తీరం దాటవచ్చని వాతావరణ శాఖ సూచిస్తున్నట్లు ప్రజలకు వివరించారు. తీరం దాటే సమయంలో వర్షం అత్యధికంగా కురిసే అవకాశాలున్నాయన్నారు. అధిక నీటి ప్రవాహం ఉండే రోడ్డులు, నదులు, వాగులతో పాటు బ్రిడ్జిలు దాటేందుకు ఎవరూ సాహించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. కృష్ణానది వైపు వెళ్లవద్దని కోరారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, చెట్లు, బలహీనంగా ఉన్న ఇంటి గోడలు వద్ద ఉండొద్దని సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను బాధితుల సహాయార్థం పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. తుఫాన్ కారణంగా ఇబ్బందుల్లో ఉంటే 0866–2491001ను సంప్రదించి సహాయం పొందవచ్చన్నారు. నదీ తీరంలోని అన్ని మండలాల్లోనూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. డీసీపీ వెంట క్రైమ్ ఏడీసీపీ వెంకటరత్నం, ఏసీపీ జనార్దననాయుడు, సీఐలు జె.ఆర్.కె.హనీష్‌బాబు, ఎం.జానకీరామ్, ఐ.వి.నాగేంద్రకుమార్, అగ్నిమాపక సిబ్బంది, పలు శాఖల అధికారులు ఉన్నారు.

స్పెషల్ సెల్ ఏర్పాటు

వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో వీఎంసీ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని కమిషనర్ చెప్పారు. నగర వాసుల సమస్యలను పరిష్కరించేందుకు 0866–2422515, టోల్ ఫ్రీ నంబర్ 18004252000, వాట్సాప్ నంబర్ 8181960909 ద్వారా ప్రజలు తమ సమస్యలను వీఎంసీ దృష్టికి తీసుకురావచ్చన్నారు. సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. స్పెషల్ సెల్‌లో నగరవాసులకు అందుబాటులో ఉండేలా 24 గంటలు మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించామని, ప్రజలకు ఎటువంటి సమస్య కలిగిన వెంటనే పైన తెలిపిన నెంబర్లకు ఫోను చేసి తమ సమస్యలను తెలపాలని కమిషనర్ కోరారు. కాల్వల నుంచి పూడిక, రోడ్లపై నీరు నిల్వ, నీటి పైపులు లీకులు, రిపేర్లు, కాల్వలకు మరమ్మతులు, సీజనల్ వ్యాధులు, చెట్టు విరిగిపడటం తదితర సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు.

జగన్‌తోనే సామాజిక న్యాయం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం చేస్తున్నారని, జగనన్న ప్రభుత్వానికి నాలుగున్నరేళ్లలో ప్రజాదరణ వెయ్యి రెట్లు పెరిగిందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58 వ డివిజన్ 240 వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరు గాలివానలో సైతం విస్తృతంగా పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారి నుంచి సలహాలు, అర్జీలు స్వీకరించారు. సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ.5.29 కోట్ల లబ్ధి చేకూర్చగా, నాన్ డీబీటీ ద్వారా రూ.3.17 కోట్లు మొత్తంగా రూ.8.46 కోట్ల మేర మేలు చేకూర్చినట్లు వెల్లడించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిచాంగ్ తుపాను పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని విభాగాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారన్నారు. ఆహారం, తాగునీరు, నిత్యావసరాలు, పాలు వంటివి అందుబాటులో ఉంచేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, శర్మ, తోపుల వరలక్ష్మి, శోభన్, నేరెళ్ల శివ, మహేశ్వరి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ స్పందనకు 10 అర్జీలు



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 10 ఫిర్యాదులు అందాయని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో టౌన్ ప్లానింగ్ విభాగం – 4, హెల్త్ విభాగం – 3, ఎస్టేట్ విభాగం – 2, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి(యూసీడీ) – ఒక ఫిర్యాదు అందిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందుకున్న ఈ ఫిర్యాదులకు సత్వర పరిష్కారాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమీషనర్(రెవెన్యూ) వెంకటలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఏఓ నరసింహ మూర్తి, ఆర్‌ఎఫ్‌ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

మధుర స్వరాల శాల ఘంటసాల



ఘంటసాల జయంతి సభలో పాల్గొన్న గోళ్ల నారాయణరావు, చంద్రశేఖర్, డేవిడ్‌రాజు

విజయవాడకల్చరల్: మధుర స్వరాల శాల ఘంటసాల అని జీఆర్‌కే సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద సోమవారం ఘంటసాల 101 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సభలో నారాయణరావు మాట్లాడుతూ ఘంటసాల స్వరం భగవంతుడు తెలుగు వారికి ఇచ్చిన గొప్ప వరమని అన్నారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి పెద బ్రహ్మం మాట్లాడుతూ ఏటా ఘంటసాల పేరుతో పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు, పాత్రికేయుడు కొల్లూరి వెంకట్, సయ్యద్ అలీ, గాయకుడు మంగరాజు పాల్గొన్నారు. గాయనీ గాయకులు ఘంటసాల పాటలను ఆలపించారు. ప్రతినిధులు ఘంటసాల చిత్రపటానికి నివాళులు సమర్పించారు.

సంగీత కళాశాల ఆధ్వర్యంలో...

దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో ఘంటసాల జయంతి సందర్భంగా ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. సుధా శ్రీనివాస్, గుడిపాటి హరికృష్ణ తదితరులు ఘంటసాల పాటలను సుమధురంగా ఆలపించారు.

రాష్ట్రానికి జగనే మళ్లీ సీఎం కావాలి

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



40వ డివిజన్‌లో డిస్ ప్లే బోర్డు ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలు మళ్లీ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం 40వ డివిజన్ పరిధిలోని 123వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం జరిగింది. నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి సంక్షేమానికి సంబంధించిన వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అంతకు ముందు పార్టీ జెండా దిమ్మెను ఆవిష్కరించారు. కార్యక్రమంపై డివిజన్‌లోని పెద్దలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, నాయకులు గౌస్ మొహిద్దీన్, యశోధర్, కేసరి కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 46వ డివిజన్‌లోని 142వ సచివాలయం పరిధిలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మిలు హాజరయ్యారు. సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల బోర్డును వారు ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి రాయన నరేంద్ర, ట్రాక్టర్ రాము, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



46వ డివిజన్‌లో పార్టీ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌దే

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట 51వ డివిజన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా 164వ సచివాలయంలో సభను నిర్వహించారు. స్థానిక ప్రజానీకంతో ఎమ్మెల్యే వెలంపల్లి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే వారికి అందిన పథకాలపై ఆరా తీశారు. అదేవిధంగా సచివాలయం పరిధిలో స్థానిక ప్రజలకు జరిగిన మేలుకు సంబంధించిన వివరాలను తెలియజేసే బోర్డును కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. విద్యా, వైద్య రంగాలకు సంబంధించిన అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని వివరించారు. రానున్న కాలంలో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవిని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి తదితరులు పాల్గొన్నారు.

400 మంది స్వాములకు అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో కార్తిక సోమవారం పురస్కరించుకుని 400 మంది స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వాములు పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసం పురస్కరించుకుని సోమవారం శివాలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ఒక వైపు గాలి, వర్షం వస్తున్నప్పటికీ భక్తులు దేవాలయాలకు చేరుకుని పూజలు చేసి దీపారాధనలు చేశారు.

ముత్యాలంపాడులో...

ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో సోమవారం స్వామి వారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు జరిగాయి. విశేషసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎన్ రాజు, కార్యదర్శి దాట్ల శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు, చిరంజీవి పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో...

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం స్వామివారికి శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో అన్నాభిషేకం, రుద్రాభిషేకం జరిగింది. మహిళలు, స్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి దీపాలను వెలిగించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.



శివగిరిపై కార్తిక పూజల సందడి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కార్తిక సోమవారం సందర్భంగా స్థానిక శివగిరిపై భక్తుల సందడి నెలకొంది. కార్తిక సోమవారం కావడంతో తెల్లవారు జామునుంచే భక్తులు శివగిరికి విచ్చేసి దీపాలు వెలిగించారు. 36 అడుగుల పంచముఖ శివలింగం దగ్గర, ఏడు పడగల నాగ పుట్ట, నాగ దేవత విగ్రహాల దగ్గర దీపాలు వెలిగించి శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జున శర్మ శివలింగానికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర లింగార్చన, రుద్రహోమం, ప్రదోషపూజ, శివ కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని శివలింగానికి పూజలు చేశారు.

మాజీ సీఎం రోశయ్య సేవలు అపూర్వం



రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య దేశానికి అందించిన సేవలు అపూర్వమని పలువురు ప్రముఖులు కొనియాడారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య రెండో వర్ధంతిని నగరపాలకసంస్థ సమీపంలోని రోశయ్య విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పీసీసీ అధ్యక్షునిగా, గవర్నర్‌గా వివిధ హోదాల్లో దేశాభ్యున్నతికి సేవలందించారని కొనియాడారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రోశయ్య జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధర రావు, ఆర్యవైశ్య సంఘం అర్బన్ అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, కార్పొరేటర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణపై సదస్సు

గన్నవరం రూరల్: మండలంలోని కొండపావులూరులో ఉన్న ఎన్ఐడీఎం(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) సౌత్ క్యాంపస్‌లో అత్యవసర సమయాల్లో బాలల హక్కులు, పిల్లల రక్షణపై సదస్సు సోమవారం జరిగింది. పోలీస్, విద్య, స్వచ్ఛంద సంస్థలు, రెవెన్యూ, పిల్లల అభివృద్ధి డిపార్టుమెంట్‌కు చెందిన 48 మంది అధికారులు శిక్షణలో పాల్గొన్నారు. సీనియర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కుమార్‌రాకా శిక్షణ ప్రారంభించారు. విపత్తుల సమయంలో పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులు, నష్టాలపై చర్చించారు. కార్యక్రమంలో అధికారులు రంజన్‌కుమార్, డాక్టర్ బాలు, నజియా షేక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

పెనమలూరు: పోరంకిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు అవడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రీనివాసనగర్‌కు చెందిన విరోదుల వరాలమ్మ(65) ఆదివారం పోరంకిలో బందరు రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు అవడంతో విజయవాడ పటమటలోని ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.